

ఇది కథ కాదు

రమణశ్రీ

వర్షం ఒక్కసారిగా పెద్దదయింది.

చల్లగాలి రివ్వున వీస్తోంది. ఆకాశం ఎయిర్ కూలర్‌లా, భూమి రిఫ్రిజిరేటర్‌లా వుంది.

"బోయ్, ఆ కిటికీ తలుపు గూడా వేసేయ్!" అరిచాను డాక్టర్ ప్రసాద్.

అది ఆఫీసర్స్ క్లబ్!

అక్కడ గాజుల గలగలలులేవు. కానీ గాజుల గలగలలను మైమరపించే గాజుగ్లాసుల గలగలలు వాతావర్ణాన్ని వేడెక్కిస్తున్నాయి.

బయట విలయ తాండవం చేస్తున్న ప్రకృతి తాలూకు చిహ్నాలు ఆ గదిలో ఏమీ ప్రతిబింబించడం లేదు.

ఆ నగరంలో పెద్ద పెద్ద ఆఫీసర్లు, పేరు పొందిన డాక్టర్లు, లాయర్లు సభ్యులుగావున్నా క్లబ్ అది

ఆకాశానికి గండి పడినా, భూమి బ్రద్దలైనా ఆ క్లబ్‌లో రాత్రిపూట లైట్లు వెలుగుతూ వుండ వలసినదే!

డాక్టర్ ప్రసాద్, లాయర్ విశ్వనాధ్, డియస్పీ పకీర్‌నాధ్, కంపెనీ ఎగ్జిక్యూటివ్ చక్రవర్తి ఆధ్వర్యంలో చతుర్ముఖ పారాయణం జోరుగా సాగి పోతున్నదా ఛాంబర్‌లో.

"షో ప్లీజ్" అంటూ పేక ముక్కలు టేబుల్‌పై పరిచాడు పకీర్‌నాధ్.

మిగిలిన ముగ్గురూ విసుగ్గా ముక్కలు గిరాటేసి డబ్బులు లెక్క చూసి యిచ్చేశారు.

"ఇక ఆట ఆపేద్దాం" అన్నాడు విశ్వనాధ్. ఆ రోజు అతని డబ్బు రమారమి మూడువేలు పోయాయి. మిగిలిన యిద్దరూ కూడా లాస్‌లోనే వున్నారు. అందుకే వెంటనే తల వూపేశారు

"ఫ్రండ్స్! ఇంకా వర్షం తగ్గినట్లు లేదు. మరో ఆట వేద్దాం" ఉత్సాహంగా పేక కలుపుతూ అన్నాడు పకీర్‌నాధ్. అతవారోజు నక్కను తొక్కి వచ్చాననుకొంటున్నాడు.

"ప్లీజ్ వద్దులే! కావాలంటే మరో రౌండ్ కొడదాం" అంటూ "బోయ్" అనరిచాడు ప్రసాద్.

మరుక్షణంలో అరిస్టోక్రాట్ విస్కీలార్జ్, ఐస్ క్యూబ్స్ జగ్‌తో ప్రత్యక్షమయ్యాడు బోయ్.

"అయితే యీ బిల్లు నీది". ఆట ఆపేసి నందుకు కపితో అరిచాడు పకీర్‌నాధ్.

"ఆల్‌రైట్! ఆ తరువాత పీటర్‌స్కాట్ భారం మాత్రం నీదే సుమా!" చిరునవ్వు చిందించాడు ప్రసాద్.

తలాకాస్త పుచ్చుకున్నాక "కాలక్షేపం కోసం ఓ కథ చెప్పండి. ఎవరైనాసరే, బోర్ కొట్టగూడదు సుమా" అన్నాడు చక్రవర్తి మరో పెగ్ అందు కుంటూ.

"కథా?" నవ్వాడు విశ్వనాధ్.

"ఇక్కడ విస్కీదాసులు తప్ప హరిదాసులెవరూ లేరోయ్" అన్నాడు పకపక నవ్వుతూ.

"మందుపడిన తర్వాత హరిదాసులూ, కాళి దాసులూ కాని వారెవరోయ్? కథలూ, కవిత్వాలూ, పైత్యాలు వరుసగా రావలసినదే!" బాటిల్ ఎత్తి గొంతులో పోసుకుంటూ అన్నాడు చక్రవర్తి.

అంతే! అంతా మౌనం వ్యాపించిపోయింది. బయట వురుముల చప్పుళ్ళు మాత్రం లీలగా వినిపిస్తున్నాయి.

ఎవరికివారే సీరియస్‌గా కథ కోసం ఆలోచనల్లో పడిపోయినట్లుగా ఫీలింగ్ పెట్టేశారు.

కిటికీరెక్క కొద్దిగా తెరచి చూశాడు ప్రసాద్

వర్షం యింకా కురుస్తూనేవుంది వర్షం తగ్గగానే స్కూటర్ స్టార్ట్ చేయడానికి రెడీగా వున్నాడు ప్రసాద్. అతని కళ్ళముందు తెల్లచీర కట్టుకొని కోటి కోరికలూరే కళ్ళతో ఎదురుతెన్నులు చూస్తున్న తార దర్శనమిస్తోంది.

"మాకేమీ కథలు స్ఫురించడంలేదు" ప్రసాద్ తప్ప మిగిలిన వారందరూ సన్నగ గొణిగారు.

చిన్నగ నవ్వాడు ప్రసాద్.

"కాలం గడవడానికి కథలొక్కటే మార్గం కాదు అనుభవాల పునశ్చరణతో సులభంగా కాలం గడపవచ్చు. మిస్టర్ పకీర్‌నాధ్ మీ పోలీస్ లైఫ్‌లో థ్రిల్లింగ్‌తో కూడిన అనుభవాలు కోకొల్లలుగ వుంటాయనుకుంటా! ఓ అనుభవాన్ని మాకూ పంచండి సార్" అన్నాడు ప్రసాద్.

అంతా కుతూహలంగా పకీర్‌నాధ్ వైపు చూశారు.

పీటర్‌స్కాట్ బాటిల్‌గూడా వచ్చి టేబుల్‌పై తిష్టవేసింది.

పకీర్‌నాధ్ మస్తిష్కంలో ఆలోచనల మధనం ప్రారంభమయింది.

రెండు నిమిషాలు గడిచాయి.

"దెయ్యాలంటే మీకు నమ్మకముందా?" హఠాత్తుగా అడిగాడు పకీర్‌నాధ్.

ఎక్కడో ధనేల్‌మంటూ పిడుగు పడిన శబ్దమయింది.

అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు

"మిస్టర్ పకీర్‌నాధ్, అది తప్ప మీకు వేరే టాపిక్ ఏమీ దొరకలేదా?" అన్నాడు విశ్వనాధ్ అతని గొంతు సన్నగా వణుకుతోంది.

చిన్నగా నవ్వాడు పకీర్‌నాథ్.

"నా సర్వీస్‌లో నేను దెబ్బతిన్న సంఘటన అదే. నా రికార్డులో ఎరుపు రంగుకు స్థానం కల్పించిన సంఘటన అది!" చిన్నగా నిట్టూరుస్తూ అన్నాడు పకీర్‌నాథ్.

"వెల్. అయితే చెప్పండి" ఎంకరేజ్ చేశాడు ప్రసాద్.

పకీర్‌నాథ్ చెప్పడం ప్రారంభించాడు.

"అవి నేను డిపార్ట్‌మెంట్‌లో సబిన్స్‌పెక్టర్‌గా పనిచేస్తున్న రోజులు. నీతి నిజాయితీలకు, ధైర్యసాహసాలకు పెట్టిన పేరునాది. ఆ రోజు చీఫ్ పిలిచి ఓ ఇన్ఫర్‌మేషన్ అందించారు. అది తెలుసుకున్న నాకు ఎంతో ఆశ్చర్యమేసింది. మాకు ఎవరికీ లభించని సమాచారాలు చీఫ్‌కు లభిస్తుంటాయి. అదే ఆయన ప్రత్యేకత!

శివార్లలో వున్న లేబర్ కాలనీలోంచీ దొంగ బంగారం రవాణా అవుతున్నదట! అది ఎక్కడి నుండి ఎక్కడకు రవాణా అవుతున్నదో కనిపెట్టమని, అవసరమైన సాక్ష్యాధారాలు సంపాదించమని పురమాయించారు.

వెంటనే రంగంలోకి దిగాను. రెండు నెలలు లేబర్ కాలనీలో లేబర్‌గా నివసించాను. చిట్టచివరకు వారి రహస్య స్థావరాన్ని కనిపెట్టగలిగాను.

పైకి మామూలుగా కన్పించే ఆ గుడిసెలో కోట్లరూపాయల విలువచేసే బంగారం దొంగరవాణా జరుగుతోంది. వాళ్ళు ఎలా దానిని బయటకు చేరవేస్తున్నారో తెలుసుకున్నాను. ఇక సాక్ష్యాధారాలు సేకరించడమే తరువాయి.

ఆ రోజు మార్గమధ్యములో వారి దొంగరవాణా కార్యకలాపాన్నంతా కెమెరాలో భద్రపరచాలని నిర్ణయించుకొని కెమేరాతో బయలుదేరి ఆ నిర్జన ప్రదేశంలో నిల్చున్నాను.

సమయం అర్థరాత్రి పన్నెండు గంటలయింది. కారుచీకటి కాలసర్పంలా బుసలు కొడుతూంటే, కీచురాళ్ళధ్వని వొళ్ళు జలదరింపచేస్తోంది.

అప్పటికి రమారమి రెండుగంటల నుండి నిలువుకాళ్ళ జపం చేస్తున్నాను.

హఠాత్తుగా నా కళ్ళు మెరిశాయి.

దూరరనుండి ఓ యువతి వస్తూ కన్పించింది.

నేను మరింత చాటుకు నక్కాను.

ఆమె మెల్లగా సమీపిస్తోంది.

విశాలమైన నేత్రాలు, చిదిమితే శృంగార మొలికేటట్లున్న చెక్కిళ్ళు, వదులుగా విరబోసుకొని వున్నా అందంగా కన్పించే జుత్తు, గుబాళించే మల్లెలు, అన్నింటినీ మించి ఆకర్షణీయమైన అంగసౌష్టవం! చూపరులకు మతిపోగొట్టే అందం ఆమెది.

'ఎవరీ వడతి? ఈ నిర్జన ప్రదేశంలో నిర్భయంగా నడచి వస్తోంది? స్మగ్లర్స్ గ్యాంగ్‌లో ఆమెను చూసిన గుర్తులేదు.' నా బుర్రలో ఆలోచనలు రగులుతున్న సమయంలో ఎక్కడినుండో చిన్నగా ఈల విన్పించింది.

ఉలిక్కిపడి ఈల విన్పించిన దిక్కుగా చూశాను.

దూరంగా ఓ పర్ణశాల లాంటి కుటీరం కన్పించింది

నాలో ఆశ్చర్యం అధికమయింది.

ఇది కథ కాదు

ఇంతకు ముందు ఆ ప్రదేశంలో ఎలాంటి కుటీరాన్ని చూసిన గుర్తులేదు. అంత అకస్మాత్తుగా ఆ కుటీరం అక్కడి కెలావచ్చింది?

ఆ యువతి అటువైపుగా నడకసాగించింది.

నాలో ఉత్కంఠ పెరిగింది.

'ఈ మిస్టరీ ఏమిటో భేదించాలి. ఒకవేళ వీళ్ళు స్మగ్లర్స్ నియమించిన మనుషులేమో!'

ఆ ఆలోచన రావడమే తడవుగా అక్కడినుండి కదిలాను.

అడుగులో అడుగు వేసుకుంటూ ఆ యువతిని అనుసరించాను.

ఆ కుటీరంలోకి ప్రవేశించిందా యువతి.

రెండు నిమిషాలాగి ఆ కుటీరం బండారం బట్టబయలు చేయాలని కుటీరం దగ్గరకు నడిచాను.

సరిగ్గా అప్పుడే ఆ ఆశ్చర్యకరమైన సంఘటన జరిగింది.

ఆ కుటీరంలోనుండి రెండు ఆకారాలు వెలుపలకు వచ్చాయి.

ఒక ఆకారం స్త్రీది. మరో ఆకారం పురుషునిది. అయితే యింతకుముందు చూసిన స్త్రీ రూపం కాదది. నల్లటి భారీ కాయం, మొరటు పెదవులు, గడ్డిపాదలాటి జుత్తుతో వికృతంగ కన్పిస్తున్న నగ్న రూపమది. పురుషుడు కూడా అదే వికృత రూపంతో నగ్నంగా వున్నాడు.

ఇరువురూ కలసి వెకిలిగా నవ్వుతున్నారు. నవ్వుతూ నా దగ్గరకు వస్తున్నారు.

వాళ్ళు నా దగ్గరకే వస్తున్నారు అనుకోగానే ఎంతో ధైర్యవంతుడనయిన నాకే కాళ్ళలోంచి వణుకు ప్రారంభమయింది. జేబులోంచి రివాల్వర్ తీయబోయాను. జేబులోకి వెళ్ళిన చేయి బయటకు రాలేదు. ఏదో విచిత్రమైన 'గాలి' సోకింది. అంతే, అలాగే నేల కొరిగిపోయాను.

స్పృహ వచ్చి చూసేసరికి అంతా గందరగోళం! నా వంటిమీద దుస్తులు వదులుగా కప్పివున్నాయి. అంటే నేను వివస్త్రుడనై వున్నానన్నమాట! చుట్టూ జనం మూగివున్నారు.

అప్పుడే గుంపులోకి జొరబడుతున్న మా మనుషులను చూడగానే నా ప్రాణం లేచివచ్చినట్లనిపించింది.

హాస్పిటల్‌కని చెప్పి నన్ను చీఫ్ దగ్గరకు మోసుకుపోయారు.

నేను చెప్పినదంతా విని చీఫ్ చిరునవ్వు నవ్వి స్వయంగా బయలుదేరారు.

రాత్రి నేను నిల్చున్న ప్రదేశం దగ్గరకు వెళ్ళాను. నేను అక్కడ నిలబడి వున్నాననడానికి గుర్తుగా నేను కాల్చి వదిలేసిన సిగరెట్ పీకలు మినహా మరే గుర్తు లభించలేదు.

అక్కడక్కడ కన్పించే పొదలు తప్ప కుటీరమనే ఆకారం ఎక్కడా కన్పించలేదు. నాకు మతి పోయింది.

చీఫ్ కొంచం కళ్ళెర్రచేసి 'భ్రమించావు' అని కసిరాడు. దానితోబాటు నా పొజిషన్ కూడా మార్చిపారేశాడు.

నేను మాత్రం ఆ సంఘటనను భ్రమగా వదిలేయలేక కాలనీలో విచారించాను. నా అనుమానం నిజమయింది.

ఓ భగ్నప్రేమికుల జంట కలసి చేసుకున్న ఆత్మహత్యల పర్యవసానమే వాటి ప్రేతాత్మల సంచారం అని తేలింది." చిన్నగా నిట్టూరుస్తూ ముగించాడు డియస్పీ పకీర్‌నాథ్.

అప్పటివరకు కథలో లీనమైపోయివున్న మిత్రులంతా వాస్తవంలోకి వచ్చారు. ఆ సంఘటనను ప్రత్యక్షంగా తిలకించామా అన్నట్లు అందరి రోమాలు నిక్కబొడిచాయి.

"నిజంగా ఎంత ఆశ్చర్యకరమైన సంఘటన! నువుకాబట్టి ప్రాణాలతో బయటపడ్డావు. అదే మేమయితేనా..." గుండెలరచేతితో రుద్దుకుంటూ అన్నాడు లాయర్ విశ్వనాథ్.

"దయ్యాలున్నమాట ఏమోగానీ, కథకుడిగా మాత్రం గొప్పగా రాణిస్తావోయ్!" వ్యంగ్యంగా అన్నాడు ప్రసాద్.

"ఇక వర్షం తగ్గింది, వెళదామా!" అంటూ లేచాడు చక్రవర్తి.

"మైగాడ్! కథ హడావుడిలో వర్షం తగ్గిన సంగతే గమనించలేదు. గుడ్‌బై ఫ్రండ్స్, మళ్ళీ రేపు కలుద్దాం" అంటూ బయటకు పరుగుతీశాడు ప్రసాద్. అతని కళ్ళముందు భార్య తార ప్రత్యక్షమయింది.

మరుక్షణంలో ప్రసాద్ స్కూటర్ స్టార్ట్ అయింది.

టైమ్ చూసుకున్నాడు ప్రసాద్.

పన్నెండు గంటలవడానికి మరో పావుగంట టైముంది. సరిగ్గా అరగంటకు యింటికి చేరుకోగలడు. ఆ తరువాత తార కౌగిలి, స్వర్గం గుర్తుకు వచ్చి తనువు పులకించింది ప్రసాద్‌కు.

ఆహ్లాదకరమైన వాతావర్ణం లభిస్తుందనే ఆశతో వూరికి దూరంగా కట్టుకున్నాడు భవంతిని.

సిమెంట్ ఫ్యాక్టరీ దాటగానే నిర్మానుష్యమైపోతుంది రోడ్డు. పచ్చటి పొలాల మధ్య జడలా రాకాశిలా పరుచుకుని వుంటుంది తారురోడ్. మున్సిపాలిటీవారి దీపాలు మిణుకు మిణుకుమంటూ వారి ఆర్థిక పరిస్థితిని చాటి చెబుతున్నాయి.

తార గుర్తుకు రాగానే ఆక్సిలేటర్ మరింత బిగించాడు ప్రసాద్. అంకెలో మీటర్ల స్పీడ్‌లోకి పికప్ అయిన స్కూటర్ చటుక్కున సడన్‌బ్రేక్‌తో ఆగిపోయింది.

ఎదురుగా ఓ వ్యక్తి నిలబడివున్నాడు.

ఆజానుబాహుడూ, స్ఫురద్రూపి అయిన ఆ వ్యక్తి తెల్లటి దుస్తులలో హుందాగా నిలబడి వున్నాడు.

"ఎక్స్యూజ్‌మి సర్! వర్షంలో చిక్కుబడి సిటీబస్ అందుకోలేకపోయాను. నాకోసం యింట్లో ఆందోళనతో ఎదురు చూస్తుంటారు. మీరు వెళ్ళే దారిలోనే నన్ను డ్రాప్ చెయ్యగలరా, ప్లీజ్" ఎంతో వినయం ధ్వనించిందా గొంతులో.

అతను మర్యాదగా అడిగిన తీరును కాదనలేక పోయాడు ప్రసాద్.

"ఎక్కండి" అన్నాడు ప్రసాద్.

అతను 'థ్యాంక్స్' చెబుతూ వెనుక ఎక్కి కూర్చున్నాడు.

గేర్ మార్చి తిరిగి స్కూటర్‌ను పోనిచ్చాడు ప్రసాద్.

టైమ్ చూసుకున్నాడు ప్రసాద్.

సరిగ్గా పన్నెండు గంటలయింది.

చటుక్కున వకీల్‌నాథ్ చెప్పిన సంఘటన గుర్తుకు వచ్చింది ప్రసాద్‌కు.

'మై గాడ్! సరిగ్గా యీ టైమ్‌లో వీడెక్కడినుండి వూడిపడ్డాడు? ఖర్మగాలి వీడు మనిషి గాక దెయ్యం కాదుకదా! అసలు స్కూటర్ ఆపుచేయవలసినది కాదు. పోనీ ఆపుచేసినా వెనక ఎక్కించుకోవలసింది కాదు.' తనను తాను నిందించుకున్నాడు ప్రసాద్.

వెన్నులోంచి సన్నగా వణుకు గూడా ప్రారంభమయింది.

వెంటనే ధైర్యం తెచ్చుకున్నాడు ప్రసాద్. 'తాను ఏమాత్రం అధైర్యపడగూడదు. 'అధైర్యవంతుడ్ని త్వరగా వశం చేసుకుంటుంది దెయ్యం' అని విన్నాడు తను. అసలు దెయ్యాలంటే కల్పిత మన్నట్లుగా ప్రవర్తించాలి. వీలయితే దయ్యాలను ఖండించాలిగూడా.' అని మనసులో అనుకుంటూ గట్టిగా సకిలించాడు ప్రసాద్.

"మిష్టర్ మీకు దయ్యాలంటే నమ్మకముందా?" డైరెక్టుగా అడిగేశాడు ప్రసాద్ వెనుక కూర్చున్నతనిని

ఉలిక్కిపడ్డాడతను. "ఇప్పుడు వాటి ప్రస్తావన ఎందుకులెండి?" అన్నాడు. అతని గొంతులో బెదురు స్పష్టంగా విన్పిస్తోంది.

ప్రసాద్ అనుమానం మరింత బలపడింది.

"రాస్కెల్! భుజాలు తడుముకుంటున్నాడు." అనుకుంటూ "మరేమీలేదు. దయ్యాలంటే అభూత కల్పనలని యిప్పటివరకు వాదించి వస్తున్నాను. సరదాగా మీ అభిప్రాయం తెలుసుకుందామని" తేలిగ్గా నవ్వుతూ అన్నాడు ప్రసాద్.

"అలాగా! అయితే దయ్యాలున్నాయని నేను ఘంటాపథంగా చెప్పగలను." అన్నాడు ఆ వ్యక్తి.

అంతే, ఆ మాటకు ప్రసాద్ గుండెల్లో ఎక్స్‌ప్రెస్ రైళ్ళు పరుగులీశాయి. ఎక్సిలేటర్ మరింత గట్టిగా బిగించాడు.

వెనుక కూర్చున్నతను ఏదో చెప్పుకుపోతున్నాడు.

"సార్, నేను అంత గట్టిగా దయ్యాలున్నాయని ఎలా చెప్పగలుగుతున్నానంటే, నేను ప్రతిరోజూ ప్రత్యక్షంగా చూసే ఓ సంఘటన వుంది. మా అక్కయ్య చచ్చిపోయి పది సంవత్సరాలవుతుంది. అప్పటినుండి మా అక్క దయ్యమై మా అమ్మను పట్టుకొని పీడిస్తోంది. రోజూ నేను మా అమ్మలో అక్కయ్య దయ్యాన్ని చూస్తూనేవుంటాను..."

ఆ వ్యక్తి చెప్పే ప్రతి మాట ఒకొక్క పిడిబాకులా దూసుకువచ్చి ప్రసాద్ హృదయాన్ని తాకుతున్నాయి.

"మై గాడ్! వీడు నిస్సందేహంగా దయ్యమే! తను ఏమాత్రం బయటపడగూడదు. అసలు ఆ మాటలుగూడా సాధ్యమైనంతవరకు వినగూడదు. కనీసం వెనక్కుతిరిగి కూడా చూడగూడదు" దృఢ చిత్తంతో ఫుల్‌స్పీడ్ పెట్టేశాడు ప్రసాద్.

సరిగ్గా ఎనిమిది నిముషాలలో ఆ నిర్మానుష్య ప్రదేశాన్నిదాటి జనారణ్యంలోకి వచ్చిపడ్డాడు ప్రసాద్.

ఒక్కసారి గుండెనిండా గాలి పీల్చుకొని చిన్నగా వెనక్కుతిరిగి చూశాడు ప్రసాద్.

వెనకాల ఆ అగంతకుడు లేడు.

"థాంక్ గాడ్! తనో పెద్ద ప్రమాదం నుండి బయటపడ్డాడు. లేకపోతే ఆ దయ్యం తనను ఏమి చేసి వుండేదో?" మళ్ళీ ఆ వూహ రాగానే ఒళ్ళు జలదరించింది ప్రసాద్‌కు.

వాచ్‌మాన్ గేటు తెరవగానే రివ్వున స్కూటర్ లోపలకు పోనిచ్చి గ్యారేజీలో పార్కుచేసి పరుగులాంటి నడకతో ఇంట్లోకి ప్రవేశించాడు.

జరిగిన సంఘటనకు ఉద్వేగంలో వొళ్ళు కంపిస్తోంది. ఇంకా గుండె వేగం తగ్గలేదు. భయంతో రొప్పుతున్నాడు. అసలు ఆ సమయంలో స్కూటర్‌మీద అంత ధైర్యంగా ఎలా ప్రయాణించగల్గాడో తనకే అర్థం కావడంలేదు ప్రసాద్‌కి.

"ఏమిటండీ? ఏం జరిగింది?" గాబరాగా ప్రశ్నించింది తార.

జరిగినదంతా ఒక్కసారి ఏకరువు బెట్టి అలసటగా మంచంపై వాలిపోయాడు ప్రసాద్.

"మై గాడ్! శ్రీ ఆంజనేయం, ప్రసన్నాంజనేయం" అనుకుంటూ భర్తకు ఎర్రనీళ్ళు దిష్టి తీసి తనూ మంచంపై చోటు చేసుకుంది తార.

*   *   *

"గుడ్‌మార్నింగ్ డాక్టర్! గుడ్‌మార్నింగ్ సర్! గుడ్‌మార్నింగ్" నర్సులు, పేషంట్లు, తోటి డాక్టర్లు అందచేస్తున్న విషెస్‌ను చిరునవ్వుతో స్వీకరిస్తూ తన ఛాంబర్‌లోకి నడిచాడు డాక్టర్ ప్రసాద్.

ఆ రోజు డైరీ తిరగేస్తున్న ప్రసాద్ 'గుడ్ మార్నింగ్ డాక్టర్' అన్న కోకిల కంఠం విని తల పైకెత్తి చూశాడు.

నీలిమ! నర్స్ నీలిమ.

మూడేళ్ళబట్టి చూస్తున్నా రోజూ యింకా చూడాలనిపించేది నీలిమ అందం. ప్రతి మాటలో, ప్రతి చూపులో ప్రత్యేకత కనబడుతుంది నీలిమలో. రోగులతో సతమతమయ్యే ప్రసాద్‌కు గొప్ప రిలీఫ్ నీలిమ సాంగత్యం.

'వాట్ డాక్టర్! రాత్రి మీరసలు నిద్రే పోలేదనుకుంటా?" చిలిపిగా అడిగింది ఎర్రబడిన ప్రసాద్ కళ్ళను చూస్తూ.

"నో నీలిమా! వర్షంవల్ల రాత్రంతా ఒక పార్టీలోనే గడపవలసివచ్చింది." అన్నాడు ప్రసాద్ రాత్రి జరిగిన సంఘటననుండి యిప్పుడే తేరుకుంటున్నాడు. తిరిగి ఆ సంఘటనను గుర్తు చేసుకోవడం యిష్టంలేదు ప్రసాద్‌కు. ఒకవేళ ఆ విషయం చెప్పినా నలుగురిలో నవ్వులపాలవడం తప్ప వేరే ఉపయోగం లేదని తెలుసు ప్రసాద్‌కు.

"నీలిమా, గోవిందరావు ఎక్కడ?" అడిగాడు. నైట్ ఇన్‌చార్జి డాక్టర్ గోవిందరావు!

"థియేటర్లో వున్నారు. వెళదాం వస్తారా?" అడిగింది నీలిమ.

"పద." ఉత్సాహంగా కుర్చీలోంచి లేచాడు ప్రసాద్.

లోపలకు ప్రవేశించిన డాక్టర్ ప్రసాద్‌ను చూసి 'హలో' అంటూ విష్ చేసి తిరిగి తన పనిలో మునిగిపోయాడు డాక్టర్ గోవిందరావు.

"వాటీజ్ ది మాటర్?" చేతులకు గ్లోవ్స్ తొడుక్కుంటూ అడిగాడు ప్రసాద్.

"పూర్‌ఫెలో, రాత్రి ఎవర్నో స్కూటర్‌మీద లిఫ్టు అడిగాడట! మరి ఆ స్కూటర్‌వాలా ఎందుకంత స్పీడ్‌గా డ్రైవ్ చేశాడో ఆ భగవంతుడికే తెలియాలి. టర్నింగ్‌లో వెనుక మనిషి క్రిందపడిపోయినా పట్టించుకోకుండా వెళ్ళిపోయాడట! ఆ పడటం ముళ్ళపొదలమీద పడ్డాడట! శరీరమంతా చీరుకుపోయి మూలుగుతూంటే ఎవరో ధర్మాత్ముడు తీసుకొచ్చి యిక్కడ జాయిన్ చేశాడు. ఫ్రాక్చర్ కూడా అయింది. ఆపరేషన్ తప్పనిసరి." నిట్టూరుస్తూ అన్నాడు డాక్టర్ గోవిందరావు.

నిర్ఘాంతపోయాడు డాక్టర్ ప్రసాద్, పేషంటు మొఖం చూస్తూ! ★